క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం వరమని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు శనివారం సింగరేణి కమ్యూనిటీ హాలులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 65 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు సన్మానం



రివార్డు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

చుంచుపల్లి: చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థిని సాయి నిపుణతో పాటు 9 కంటే ఎక్కువ జీపీఏ సాధించిన తొమ్మిది మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శనివారం పాఠశాల సిబ్బంది శాలువాలతో సత్కరించారు. ఇందులో భాగంగా ఐఐఐటీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు రూ.5,000 నగదు బహుమతిని అందించారు. హెచ్ఎం వసంతలక్ష్మి, సంధ్యారాణి, ఎంపీ శ్రీనివాసరావు, తారాచంద్, నాగేంద్రబాబు, శంకర్ పాల్గొన్నారు.

ఏరియా జీఎంకు సన్మానం



జీఎం శాలెంరాజును సన్మానిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును శనివారం కొత్తగూడెం ఏరియాలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాంట్రాక్ట్ కార్మికులు మాట్లాడుతూ.. తమకు ప్రతినెల 7వ తేదీలోపు వేతనాలు అందించే విధంగా చూడాలని, ఏరియాలో ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను సీనియారిటీ ప్రకారం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.


పొంగులేటి నియామకంపై హర్షం

కొత్తగూడెంరూరల్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్‌గా నియమించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెం పట్టణంలో నాయకులు ఊకంటి గోపాల్‌రావు, నాగా సీతారాముల ఆధ్వర్యంలో విద్యానగర్ నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆళ్ల మురళి, తూము చౌదరి, యర్రంశెట్టి ముత్తయ్య, ఆకునూరి కనకరాజు, చింతలపూడి శెఖర్, గుడివాడ రామలక్ష్మణ్, తాండ్ర నాగబాబు, దేవరగట్ల ప్రసాద్, పూనెం శ్రీను, సత్యనారాయణరెడ్డి, గౌస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: ఎండీ ఇమ్రాన్ మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మృతుడి కుటుంబసభ్యులకు రూ.25 వేల ఆర్థికసాయం అందించారు.

అద్దె బస్సులను కదలనివ్వం



నిరసనలో పాల్గొన్న భూక్యా రమేష్

చుంచుపల్లి: అద్దె బస్సుల కార్మికుల జీతాలు పెంచేవరకు హైర్ బస్సులను కదలనివ్వమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా రమేష్ అన్నారు. శనివారం కొత్తగూడెం బస్టాండ్‌లో అద్దె బస్సుల కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. మాట్లాడుతూ.. హక్కుల కోసం, జీతాల పెంపు కోసం, న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆర్టీసీ అద్దె బస్సుల కార్మికుల సమ్మె కొనసాగుతుందన్నారు. కత్తి నరసింహారావు, సైదులు, గిరి, శ్రవణ్, ఆదినారాయణ, రాజు, పాషా, వంశీ, గోపీ పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని 24 ఏరియాకు చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైన సంఘటనపై శనివారం కేసు నమోదయింది. ఏఎస్ఐ రవి తెలిపిన వివరాలు.. యువతి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లింది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవటంతో ఆమె తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురోగతి లేని గిరిజన గ్రామాలు

- రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండడంతో అభివృద్ధికి ఆటంకం
- రహదారుల పనులకు రూ.6 కోట్లు మంజూరు
- నిలిపివేసిన అటవీశాఖ అధికారులు



కారెగట్టు గ్రామం

పాల్వంచరూరల్: స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఉన్న రెండు గ్రామాలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయని అధికారులు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారు. దీంతో ఆ గ్రామాల్లో పురోగతి లేకుండా పోయింది. మండల పరిధిలోని కారెగట్టు, సారెకల్లు గ్రామాలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయని వైల్డ్‌లైఫ్ అధికారులు గతేడాది గ్రామంలో హద్దులు కూడా నిర్ణయించి దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు వాటిని కూల్చివేశారు. ఈ క్రమంలో అటవీ శాఖాధికారులు స్థానికులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. కారెగట్టు గ్రామంలో మొత్తం 176 నివాసగృహాలు ఉండగా 710 మంది జనాభా ఉన్నారు. సారెకల్లు గ్రామంలో 150మంది జనాభా ఉన్నారు. ఈ రెండు గ్రామాలు 1945లోనే ఏర్పడ్డాయని ఇప్పుడు అటవీ అధికారులు ఫారెస్ట్ పరిధిలో ఉన్నాయనడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి రైతుల సాగుభూములకు పట్టాలు కూడా ఉన్నాయి. రెవెన్యూ, ఫారెస్ట్ జాయింట్ సర్వే చేసి హద్దులు నిర్దేశించాలని గత ఏప్రిల్‌లో కలెక్టర్‌కు.. సర్పంచ్ పాలకవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ జాయింట్ సర్వే జరపాలని తహసీల్దార్‌ను కూడా ఆదేశించారు. అయినా నేటికీ జాయింట్ సర్వే నిర్వహించ లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయని ఏళ్ల తరబడి ఫారెస్ట్ (వైల్డ్‌లైఫ్) శాఖాధికారులు ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు. సత్యనారాయణపురం నుంచి సారెకల్లు గ్రామం వరకు 4 సంవత్సరాల క్రితం రూ.6కోట్ల వ్యయంతో తారురోడ్డు మంజూరు కాగా.. అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో రోడ్డు నిర్మాణం జరగలేదు. అంతేకాదు గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేయకుండా నిలిపివేయగా, తాజాగా గ్రామపంచాయతీకి రూ.25లక్షల నిధులు మంజూరు కాగా గ్రామసర్పంచ్ గ్రామశివారులో పంచాయతీ భవన నిర్మాణం కోసం ప్రయత్నం చేయగా దానినిన కూడా అటవీ అధికారులు నిలిపివేశారు. దీంతో గ్రామపంచాయతీ భవనం పాతస్కూల్ భవనంలోనే నిర్వహిస్తున్నారు.



అటవీశాఖ అభ్యంతరంతో నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణం

శాశ్వత పరిష్కారం చూపాలి



ఏళ్ల క్రితం ఏర్పడిన కారెగట్టు, సారెకల్లు గ్రామాలు రిజర్వ్ ఫారెస్టులో ఉన్నాయని ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా అభివృద్ధి పనులు జరగకుండా అడ్డుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– శెట్టిపల్లి దుర్గ, కారెగట్టు సర్పంచ్

కలెక్టర్‌కు విన్నవించాం



కారెగట్టు, సారెకల్లు గ్రామాలు స్వాతంత్ర్యానికి ముందే ఏర్పడిన గ్రామాలు. ఇప్పుడు అధికారులు ఫారెస్టు భూమి అనడం సరికాదు. అటవీ అధికారులు హద్దులు వేయడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్, ఫారెస్టు ఉన్నతాధికారులకు విన్నవించాం.

– వి.రవి, సత్యనారాయణపురం, ఎంపీటీసీ

రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయి



కారెగట్టు, సారెకల్లు గ్రామాలు రిజర్వ్ ఫారెస్టు భూమి పరిధిలో ఉన్నాయి. గతేడాది హద్దులను కూడా ఏర్పాటు చేశాం. అభివృద్ధి పనులు జరగాలంటే పంచాయతీ తీర్మానం చేసి ఐటీడీఏ పీఓకు ప్రతిపాదనలు పంపాలి. అనుమతి ఇస్తే మేము అడ్డు చెప్పము.

– శ్రీనివాసరావు, వైల్డ్‌లైఫ్ రేంజర్, యానంబైల్

విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించాలి



సుజాతనగర్: మాట్లాడుతున్న న్యాయమూర్తి భానుమతి



ఇల్లెందు: మాట్లాడుతున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి

సుజాతనగర్: విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు 'యాంటీ ర్యాగింగ్ పర్యవేక్షణ కమిటీ'ని ఏర్పాటు చేయాలని న్యాయమూర్తి జి.భానుమతి అన్నారు. ధన్వంతరి ఫార్మసీ కళాశాలలో 'విద్యా సంస్థలలో ర్యాగింగ్ నిషేధం'అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రతీ కళాశాల ప్రాంగణం, నోటీస్ బోర్డులో ర్యాగింగ్ నిరోధక హెల్ప్ లైన్ నంబర్ మరియు బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. జూనియర్ విద్యార్థుల పట్ల సీనియర్ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్‌ను నిలువరించేందుకు నిఘా పెట్టాలని పోలీసులకు సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కాసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: చట్టంలో ర్యాగింగ్ నిషేధించబడిందని, కఠిన చర్యలు అమలులో ఉన్నాయని న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి తెలిపారు. శనివారం సుదిమళ్ల గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జరిగిన న్యాయచైతన్య సదస్సులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్ వల్ల కొంతమంది చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవికుమార్, జాయింట్ సెక్రెటరీ కీర్తి కార్తీక్, ఉమామహేశ్వర్‌రావు, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జూలూరుపాడు: చౌక దుకాణాల డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జూలూరుపాడు తహసీల్దార్ శారద తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో కొత్తగా మంజూరైన చీపురుగూడెం, పడమటనర్సాపురం-2, జూలూరుపాడు -2, కాకర్ల-2, వినోభానగర్ రేషన్ డీలర్ల భర్తీ కోసం అర్హులైన ఎస్టీ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు అర్హులని, ఈనెల 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

పోడు భూముల కబ్జాలను అరికట్టండి

సుజాతనగర్: పట్టా హక్కులు పొందిన తమ పోడుభూములను కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని చిట్టి రామవరానికి చెందిన పోడు రైతులు తహసీల్దార్ సునీల్‌రెడ్డికి శనివారం విన్నవించారు. పోడు రైతులు మాట్లాడుతూ... గరీబ్‌పేట బీట్ పరిధిలోని 20వ సర్వే నంబరులో తమకు పోడు పట్టాలు వచ్చాయని, ఈ భూముల్లో ఐదుగురు సరిహద్దు రైతులు రాత్రికి రాత్రే ట్రాక్టర్‌తో దున్ని కబ్జాలకు పాల్పడ్డారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పోడు రైతులు లక్ష్మణ్, సుక్యా, గొబ్రియా, పూర్ణ, మహేష్, కమల, బాలు, రూప్లా పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడిగా కిరణ్



నియామకపత్రం అందుకుంటున్న కిరణ్

జూలూరుపాడు: మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) జిల్లా అధ్యక్షుడిగా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంకు చెందిన దేవరకొండ కిరణ్ నియమితులయ్యారు. శనివారం ఖమ్మంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎంహెచ్‌డీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ కిరణ్‌కు నియామక పత్రం అందించారు.

అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 23, 24 తేదీల్లో జరగనున్న అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. శనివారం రామవరంలో అంగన్‌వాడీ టీచర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచేందుకు ఒకరిపై ఒకరు సాకులు చెబుతూ జీతాలు పెంచకపోగా, బెనిఫిట్స్ అమలు చేయడం లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లపై ప్రభుత్వశాఖల అధికారులు వేధింపులకు అడ్డూఅదుపు లేకుండా పోతోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీవించే హక్కు కల్పించండి..



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఇల్లెందు: ఏజెన్సీలో గిరిజనులతో కలిసి మెలిసి సహజీవనం చేస్తున్న గిరిజనేతరులకు జీవించే హక్కు కల్పించాలని, పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఇంటి నంబర్లు, మీటర్లు ఇవ్వాలని 'గిరిజనేతర హక్కుల పోరాట ఐక్య వేదిక'కోరింది. శనివారం రాందేవ్ బాబా మందిరంలో జరిగిన సమావేశంలో కుల సంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఐక్య వేదిక కన్వీనర్ జనగం కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న జరగనున్న ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు. అన్ని కులాలు, పార్టీలు మద్దతు ప్రకటించాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియ, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యను కలిసి వినతిపత్రాలు అందజేశారు. పులిగళ్ల మాధవరావు, శ్రీరాం కోటయ్య, బండారు సత్యం, మంచె రమేష్, హరిప్రసాద్ యాదవ్, బండారు నాగేశ్వరరావు, తుడుంబాబు, కోడి మల్లయ్య, లింగన్న, నెల్లూరి వెంకటేశ్వర్లు, వినయ్, శివ, కోటయ్య, కాళీదాస్, గాంధీ, రాజా, శ్రీను, సంపత్, కృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించకుంటే ఉద్యమిస్తాం..

కొత్తగూడెంటౌన్: ఉద్యమకారులను గుర్తించకుంటే రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని తొలిమలి ఉద్యమకారుల ఫోరం గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య హెచ్చరించారు. శనివారం కొత్తగూడెంలోని ఆ సంఘం కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై 1969 నుంచి 2014 వరకు అనేక పోరాటాలు చేశామన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులతో పాటు సాధారణ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంచినీటి కష్టాలు, నిత్యావసర ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితులు ఉన్నాయని వాపోయారు. ప్రజల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎం.వలీభాబా, అల్లి భాస్కర్, కూచన కృష్ణారావు, కాకెల్లి సైమన్, ఎడ్ల ఎలియా, సఫ్దార్‌బేగ్, దేవులపల్లి రాంమూర్తి, జావేద్, మాతంగి లింగయ్య, అవునూరి రాయలింగు, శ్రీపాద సత్యనారాయణ, అలీముద్దీన్, పాల్గొన్నారు.

అటవీ రక్షణ కమిటీ సమావేశం



పోడు రైతులతో మాట్లాడుతున్న అధికారులు

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం అటవీ రక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజలు కొత్తగా పోడు చేయడం గానీ, అటవీ ప్లాంటేషన్‌ను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వ్యక్తుల నుంచి రెవెన్యూ రికవరీ చేయనున్నట్లు చెప్పారు. ఇటీవల పాపకొల్లు అటవీ బీట్‌లో ప్లాంటేషన్‌ను అక్రమంగా నరికిన వెనకతండాకు చెందిన రైతులతో అధికారులు మాట్లాడారు. అటవీ ప్లాంటేషన్ వైపు వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పోటు గణేష్, ఎఫ్ఎస్ఓలు మల్లయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శనివారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెంలో రూ.115 కోట్లు, పాల్వంచలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీలు, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. రెండు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, ఆత్మకమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, ఉర్దూఘర్ చైర్మన్ అన్వర్ పాషా, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్ని సంఘాలకూ అవకాశం కల్పించండి



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

టేకులపల్లి: సింగరేణిలో ఎన్నికలు జరిగే వరకు అన్ని సంఘాలకు అన్ని కార్యక్రమాల్లో సమాన అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఎండీ.నజీర్ అహ్మద్ కోరారు. ఈ మేరకు శనివారం కేటీసీలో ఉదయం మొదటి షిఫ్ట్ సేఫ్టీ సమావేశం జరుగుతున్న సమాచారం తెలుసుకొని ఏఐటీయూసీ పిట్ కమిటీ ఆధ్వర్యంలో పీఓ కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సేఫ్టీ ఆఫీసర్ వచ్చి ఉన్నతాధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్ని సమావేశాలకు అన్ని సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, సామల శ్రీనివాస్, కనకరాజు, కల్యాణ్, వెంకటనర్సయ్య, దావూద్, నవీన్, విజయ్ కుమార్, ఖయ్యూం, అహ్మద్, ఎల్లబొయిన రాములు, నాగేందర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీకి రూ.2 కోట్ల రుణం ఇవ్వాలి

టేకులపల్లి: బేతంపూడి ప్రాథమిక సహకార పరపతి సంఘానికి రూ. 2 కోట్ల రుణ సాయం చేయాలని, ఇందుకు డీసీసీబీ చైర్మన్ సహకరించాలని సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ లక్కినేని సురేందర్‌రావు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలో గతేడాది 5,600 మంది రైతులకు రూ.20 కోట్ల రుణం ఇచ్చామని, వారిలో 950 తిరిగి చెల్లించారని తెలిపారు. గతేడాది రూ.4.5 కోట్ల ఎరువులు, రూ.70 లక్షల పురుగుల మందు వ్యాపారం చేశామని, ఈ సంవత్సరం రూ.6 కోట్ల వ్యాపార లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో బేతంపూడికి మీ సేవా కేంద్రం మంజూరైందని, జనరిక్ మెడికల్ షాప్ కూడా మంజూరైందని, వీటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పెట్రోల్‌బంక్ మంజూరు కాగా, స్థల పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఈఓ పొన్నోజు ప్రేమాచారి, కందుల వెంకటేశ్వర్లు ఉన్నారు.

కార్మికులను అడ్డగించిన పోలీసులు



కార్మికులను బలవంతంగా వాహనంలో ఎక్కిస్తున్న పోలీసులు

పాల్వంచ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం కొత్తగూడెం క్రాస్ రోడ్డు నుంచి పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటిని ముట్టడించేందుకు వస్తుండగా.. స్పాంజ్ ఐరన్ గేటు వద్ద పోలీసులు అడ్డగించారు. కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద మాట్లాడిస్తామని బలవంతంగా వాహనాల్లో ఎక్కించి తరలించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నారాటి ప్రసాద్ మాట్లాడుతూ.. మధ్యాహ్న కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుత్తుల సత్యనారాయణ, సత్తెనపల్లి విజయలక్ష్మి, వీసంశెట్టి పూర్ణ, మల్లికార్జున్, పుష్ప, మంగ, ప్రభావతి, పండు, లక్ష్మి, రమాదేవి, భాగ్యమ్మ, నర్సమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఇల్లెందురూరల్: ప్రభుత్వం పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం కొత్తగూడెం జిల్లా పరిషత్ యూనిట్ అధ్యక్షుడు ఎం.రాజేష్ కోరారు. ఇల్లెందు సమితి అధ్యక్షుడు యాచారపు శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్ పోస్టుకు గెజిటెడ్ హోదా కల్పించాలని, 317జీఓ ద్వారా నూతన జిల్లాలో సర్దుబాటు అయిన ఉద్యోగులకు వెంటనే సీనియారిటీ ప్రకారం ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. సమావేశంలో తోటకూర వెంకటేశ్వరరావు, జయకృష్ణ, ప్రసాద్, సాధు వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, పార్వతి, అబ్దుల్ షరీఫ్, సర్ఫరాజ్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా బోనాల వేడుక



బోనాలతో కేటీపీఎస్ డీఏవీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



సరస్వతి స్కూల్‌లో విద్యార్థుల సందడి

పాల్వంచ: పట్టణంలోని కేటీపీఎస్‌డీఏవీ పాఠశాలలో ఆషాఢమాసం పురస్కరించుకుని బోనాల వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. ముత్యాలమ్మ తల్లి, పోలేరమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, పోతురాజు వేషధారణలతో జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోనాల పండగ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.రామారావు, డ్యాన్స్‌మాస్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు గోరింటాకు పెట్టారు. గోరింటాకు విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాల కార్యదర్శి ఆకుల ఆనంద్, ప్రిన్సిపాల్ సుస్వర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

బర్లగూడెం రోడ్డుకు మోక్షం లేదా..?



టేకులపల్లి మండలం ఒడ్డుగూడెం నుంచి బర్లగూడెం రోడ్డుకు మోక్షం కలగడం లేదు. సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బర్లగూడెం వెళ్లాలంటే కచ్చా రోడ్డే దిక్కు. రోడ్డంతా పెద్దపెద్ద గుంతలు. వర్షం పడితే ఇక అంతే సంగతులు. ఈ మార్గంలో ప్రయాణమంటే నరకయాతన. దీనికి పక్కా రోడ్డు మంజూరైనప్పటికీ అటవీ శాఖ అభ్యంతరాలతో పురోగతి లేదు. దశాబ్దాల కాలం నుంచి ఆదివాసీలు పక్కా రోడ్డు కావాలని కోరుతున్నా ఫలితం దక్కడం లేదు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 92814 79238